క్లుప్తంగా

500 మందికి అన్నదానం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆకలితో ఉన్న వారి కడుపు నింపడంలో ఉన్న తృప్తి మరెందులో లభించదని హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపక సభ్యులు షఫీవుల్లా అన్నారు. ముత్యాలంపాడు రావి చెట్టు సెంటర్‌లో బుధవారం హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిరుపేదలకు అన్నదానం జరిగింది. ఆయన మాట్లాడుతూ అన్నిదానాల్లో అన్నదానం మిన్న అని తాము సామాజిక బాధ్యతగా అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం సుమారు 500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మల్లిక, హేమంత్‌రావు, గోపీచంద్, రహీమ, అవినాష్, వైష్ణవ్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు రావిచెట్టు సెంటర్ సమీపంలో బుధవారం పెనుమత్స సత్యం ఫ్రెండ్స్‌సర్కిల్ ఆధ్వర్యాన రత్న ఎంటర్‌ప్రైజెస్ ప్రసాద్ సహకారంతో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు నక్కా గోవిందు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



మధురానగర్(విజయవాడసెంట్రల్): నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు పనులు పూర్తి చేయాలని 30వ డివిజన్ కార్పొరేటర్ జానారెడ్డి సూచించారు. 30వ డివిజన్ రామకృష్ణాపురంలో బీటీ రోడ్డు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ పైపులైన్‌కు మరమ్మతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 30వ డివిజన్ గద్దె వెంకట్రామయ్యనగర్‌లో వాటర్ పైపులైన్ మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక్కడ వాటర్ పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో నగరపాలక సంస్థ వాటర్ వర్క్స్ సిబ్బంది పైపులైన్‌లకు అవసరమైన మరమ్మతులు చేయటంతో పాటు అవసరమైన కొత్త పైపులను ఏర్పాటు చేశారు. వేసవి కావటంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేస్తున్నటు అధికారులు తెలిపారు.

నేడు జాబ్ మేళా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25 గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ మేనేజర్ సీహెచ్ మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో హెట్రో, అరబిందో, బుక్ ఎక్స్‌పర్ట్, ఇన్‌ఫ్లోక్యూరిస్, యాక్సిస్ బ్యాంక్ , టీఎం లీజ్, జియో, కాలిబర్ వంటి 12 కంపెనీలలో 500లకు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, డిప్లమో చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. రూ.10వేలు నుంచి 20వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9676955667, 7842503456, 96522861315 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీలో పెరిగిన ఉద్యోగ భద్రత



పెనమలూరు: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తరువాత ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లభించిందని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు అన్నారు. యూనియన్ 27వ రాష్ట్ర మహాసభలు పోరంకి మురళీ రిసార్ట్స్‌లో బుధవారం నిర్వహించారు. కృష్ణాజిల్లా పెనమలూరులోని వైవీరావు సభాప్రాంగణం, బి.రామారావు సభావేదికపై జరిగిన సమావేశంలో దామోదరరావు మాట్లాడారు. ఎండీ ద్వారకా తిరుమలరావు చొరవతో 2,096 మంది ఉద్యోగుల ప్రమోషన్లకు ప్రభుత్వం అనుమతించిందని తెలిపారు. పీఆర్‌సీ నెలలోనే అమలవుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవులు, ఉద్యోగుల నైట్‌అవుట్ అలవెన్సులు జీతంలో కలిపి ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల సంక్షేమ ప్రభుత్వ సలహాదారుడు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి మట్లాడుతూ.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తానని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని చెప్పారు. ఉద్యోగులు ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

నూతన కమిటీ ఎన్నిక

ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీ ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా పలిశెట్టి దామోదరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.సుబ్రహ్మణ్యం, ఛీఫ్ వైస్ ప్రెసిడెంట్లుగా షేక్.సుభాని, కె.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా నరసయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ప్రభాకర్‌యాదవ్, జి.నారాయణరావు, ప్రసాద్, కార్యవర్గ సభ్యులు ఎంపికయ్యారు.

అభివృద్ధిలో మేటిగా నిలుపుదాం

58వ డివిజన్‌లో రూ.60 లక్షల వ్యయ అంచనాతో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో నగరం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, 'సెంట్రల్'ను మేటిగా నిలుపుతామని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 58వ డివిజన్ ఇందినాయక్ నగర్, నేతాజీ రోడ్డు, స్మైల్ హాస్పటల్ ప్రాంతాల్లో రూ.60 లక్షల వ్యయ అంచనాతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి బుధవారం ప్రారంభించారు. సెంట్రల్ నియోజకవర్గానికి నాడు వైఎస్సార్ రూపకల్పన చేస్తే నేడు ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయల నిధులు కేటాయించి అభివృద్ధికి సరికొత్త బాటలు వేస్తున్నారని కొనియాడారు. టీడీపీ ప్రభుత్వ హయంలో సెంట్రల్ అభివృద్ధిని గాలికి వదిలేశారని, వసతుల కల్పించడంలో నాటి పాలకులు విఫలమయ్యారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గ ముఖచిత్రం పూర్తిగా మారిపోయిందన్నారు. 241వ వార్డు సచివాలయం పరిధిలో రూ.20 లక్షల వ్యయ అంచనాతో నేతాజీ వీధికి సీసీ రోడ్డు, 259వ వార్డు సచివాలయం పరిధిలో మరో రూ.20 లక్షలతో అమెరికన్ హాస్పటల్ నుంచి షాదీఖానా క్రాస్ రోడ్డు వరకూ బీటీ రోడ్డు విస్తరణ పనులు చేయనున్నట్లు తెలిపారు. 258వ వార్డు సచివాలయం పరిధిలోని కర్నాటి బిల్డింగ్ రోడ్డులో రూ.20 లక్షల వ్యయంతో షాదీఖానా క్రాస్ రోడ్డు నుంచి నున్న ప్రధాన రహదారి వరకూ బీటీ రోడ్డు పనులను చేపట్టినట్లు వివరించారు.

డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నగర శివారు ప్రాంతాల ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని తెలిపారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు నాయకత్వంలో నియోజకవర్గం మరింత అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని తెలిపారు. కార్పొరేషన్ డీఈ గురునాథం, వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, వసంత్, తోపుల వరలక్ష్మి, గోపిరెడ్డి, శర్మ, శోభన్, రాజా తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు



చిట్టినగర్ యూపీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగర పరిధిలోని చిట్టినగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె బుధవారం సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహనాయక్‌తో కలిసి యూపీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ అందుతున్న సేవలను పరిశీలించారు. అవుట్ పేషెంట్ సేవలు, రక్తపరీక్షలు నిర్వహణ, మందుల అందుబాటు, రికార్డులు పరిశీలించారు. మే నెలకు సంబంధించి 534 మంది అవుట్ పేషెంట్లను పరీక్షించగా, ప్రత్యేక ఓపీలో 90 మందిని పరీక్షించినట్లు రికార్డులు ఉన్నాయి. ఈహెచ్‌ఆర్ నమోదు 523 కాగా, ఈ సంజీవని 168 రికార్డులు అందుబాటులో ఉన్నట్లు డాక్టర్ సుహాసిని తెలిపారు. ఇక్కడ ఓపీ సేవలతో పాటు, నిర్దేశిత రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సుహాసిని తెలిపారు. రోజూ క్రమం తప్పకుండా ఓపీ, రక్తపరీక్షలు నిర్వహించడంతో పాటు, మందులకు ఎలాంటి కొరత లేదని ఆమె పేర్కొన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన సేవలు అందిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఇక్కడ లాస్ట్ గ్రేడ్ సర్వీస్‌పోస్టు ఖాళీగా ఉందని, దాని భర్తీకి చర్యలు తీసుకుంటానన్నారు.

అవాస్తవాలు రాయొద్దు

చిట్టినగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, అన్ని రకాల పరీక్షలు చేస్తుండగా, ఒక పత్రికలో(సాక్షి కాదు) వాస్తవ విరుద్ధమైన, సత్యదూరమైన కల్పిత కథనాలు రాయడాన్ని ఆమె ఖండించారు. వాస్తవాలు మరిచి కథనాలు రాయడం మంచిది కాదని హితవు పలికారు.

యువతి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యువతి అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. బ్రహ్మం గారి గుడి ప్రాంతానికి చెందిన యువతికి 6వ తరగతి వరకు చదువుకుని ఇంటి వద్దే ఉంటోంది. ఆమెకు తెలంగాణ రాష్ట్రం జనగాం ప్రాంతానికి చెందిన యువకుడితో నిశ్చితార్థమైంది. అప్పటి నుంచి తనకు ఆ పెళ్లి ఇష్టం లేదని, అంతదూరం వెళ్లనని తల్లికి చెబుతోంది. మంగళవారం రాత్రి తనకు పెళ్లి ఇష్టం లేదని మరోసారి చెప్పింది. తెల్లవారిన తర్వాత మాట్లాడుకుందామని చెప్పి తల్లి నిద్ర పోయింది. బుధవారం తెల్లవారు జామున చూడగా యువతి కనిపించలేదు. దీనిపై ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పట్టాల పంపిణీని జయప్రదం చేయాలి

ఎమ్మెల్యే మల్లాది విష్ణు



వార్డు సచివాలయం సిబ్బందికి సూచనలు చేస్తున్న మల్లాది విష్ణు

మధురానగర్/గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పేదలకు అమరావతిలో ఈ నెల 26న పండగ వాతావరణంలో జరగనున్న పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు పిలుపునిచ్చారు. 25వ డివిజన్ అరండల్ పేటలోని 96 వార్డు సచివాలయం, మారుతీనగర్‌లోని 29వ వార్డు సచివాలయాలను బుధవారం సందర్శించారు. పట్టాల పంపిణీ ఏర్పాట్లపై 25, 26 డివిజన్ల పరిధిలోని సచివాలయాల సిబ్బందితో సుదీర్ఘంగా చర్చించారు. ఆర్ 5 జోన్‌లో నియోజకవర్గం నుంచి ఇళ్ల మంజూరైన 7,211 మందికి పట్టాల పంపిణీ రోజున ఉచిత బస్సులు ఏర్పాటు చేసినట్లు మల్లాది విష్ణు తెలిపారు. లబ్ధిదారులు బయలుదేరినప్పటి నుంచి సభ ముగిసే వరకు వారికి లోటు రాకుండా చూడాలని సిబ్బందికి సూచనలు చేశారు. సమావేశంలో జోనల్ కమిషనర్ సృజన, సీడీఓ జగదీశ్వరి, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ బంకా శకుంతల, నాగేశ్వరరావు, వీఆర్వోలు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కాపాడిన కృష్ణలంక పోలీసులు



కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడిని కృష్ణలంక పోలీసులు రక్షించారు. సేకరించిన వివరాల మేరకు మన్యం జిల్లా పార్వతీపురంమండలంలోని సాలూరుకు చెందిన ఎం.ఎ.ఎల్.ప్రసాద్ నగరంలో ఉంటూ నాగార్జున యూనివర్సిటీలో డిగ్రీ చదువుతున్నాడు. చదువు కొనసాగించడం ఇష్టంలేని ప్రసాద్ తల్లిదండ్రుల ఒత్తిడితో చదువుతున్నాడు. తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి రైల్వే బ్రిడ్జి పై నుంచి కృష్ణా నదిలోకి దూకేందుకు యత్నించాడు. సమాచారం అందుకున్న సీఐ దుర్గారావు వెంటనే అప్రమత్తమై కానిస్టేబుల్ రాములు, ఇతర సిబ్బందిని ఘటనా స్థలానికి పంపించి యువకుడిని రక్షించారు. కౌన్సిలింగ్ ఇచ్చి యువకుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

డీఆర్ఎం షివేంద్రమోహన్



ఈటీటీసీలో క్యాంటిన్, డైనింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న డీఆర్ఎం షివేంద్రమోహన్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే సిబ్బంది సంక్షేమానికి విజయవాడ డివిజన్ అధిక ప్రాధాన్యమిస్తోందని డీఆర్ఎం షివేంద్రమోహన్ పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని ఈటీటీసీ (ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్)లో ఆధునీకరించిన కిచెన్, డైనింగ్ హాల్, వాకింగ్ ట్రాక్‌లను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణపురంలోని ఈటీటీసీ సెంటర్‌లో దక్షిణ మధ్య రైల్వేతోపాటు ఇతర జోన్లలోని రన్నింగ్, టీఆర్ఎస్, ఈఎంయూ, టీఆర్‌డీ సిబ్బందికి వివిధ విభాగాల్లో శిక్షణ ఇస్తారన్నారు. 2007 నుంచి ఇక్కడ 3–ఫేజ్ లోకోమోటివ్‌లపై కూడా లోకో పైలెట్లకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సెంటర్ నుంచి ఏడాదికి 7 వేల మంది లోకోపైలెట్లు శిక్షణ పొందుతారని తెలిపారు. శిక్షణ కాలంలో వారి కోసం హాస్టల్, క్యాంటిన్ సదుపాయాలు అందిస్తున్నట్లు తెలిపారు. వారికి మరిన్ని సౌకర్యాలు అందించడానికి రూ. 30 లక్షలతో క్యాంటిన్, డైనింగ్ హాల్‌తో పాటు 2,600 మీటర్ల పొడవైన వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీకాంత్, సీనియర్ డీఈఈ కొండా శ్రీనివాసరావు, ఆర్‌సీ సాహు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏటీఎం కార్డు మార్చారు.. డబ్బు తస్కరించారు..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వ్యక్తిని ఏమార్చి... ఏటీఎం కార్డు మార్చి డబ్బులు కాజేసిన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని గొల్లపూడి గ్రామంలో చోటు చేసుకుంది. గొల్లపూడి గ్రామానికి చెందిన గుండు అచ్యుతరావుకు ఎస్‌బీఐ బ్యాంక్‌లో ఖాతా ఉంది. గత నెల 10న ఏటీఎం పిన్ జనరేట్ చేసేందుకు గొల్లపూడి వన్‌సెంటర్‌కు వెళ్లాడు. అప్పటికే అక్కడ ఉన్న ఒక వ్యక్తి తాను పిన్ జనరేట్ చేస్తానంటూ అచ్యుతరావు వద్ద ఉన్న ఏటీఎం కార్డు తీసుకున్నాడు. పిన్ ఏ నంబర్ కావాలని అడగగా నంబర్ చెప్పాడు. కొద్ది సేపటి తర్వాత కార్డు తిరిగి ఇవ్వగా అచ్యుతరావు ఇంటికి వెళ్లాడు. అతను ఇచ్చిన కార్డు తన వద్దనే ఉంది. అయితే ఈ నెల 15న రూ. 40వేలు, 16న రూ. 30వేలు డ్రా చేసినట్లు అచ్యుతరావు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. అప్పుడు కార్డు తీసుకోగా అది తనది కాదని తేలింది. పిన్ జనరేట్ చేసి ఏమార్చి ఏటీఎం కార్డు మార్చాడని గుర్తించిన బాధితుడు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.






జలక్రీడల్లో శిక్షణ

పున్నమి ఘాట్ సమీపంలో శాప్ ఆధ్వర్యాన చిన్నారులకు వాటర్ స్పోర్ట్స్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఈ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో బుధవారం సుమారు 50 మంది పైగా పాల్గొన్నారు. కయాకింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్న దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రాజకీయాలకతీతంగా ప్రభుత్వ పథకాలు

గడప గడపలో ఎమ్మెల్యే విష్ణు



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ అనిత

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో అవినీతికి, వివక్షకు తావులేకుండా, రాజకీయాలకతీతంగా ప్రభుత్వ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకూ అందజేస్తున్నారని రాష్ట్ర ప్లానింగ్‌బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం 24వ డివిజన్‌లో 91వ సచివాలయం పరిధిలోని విశాలాంధ్ర రోడ్డు, గద్దె బాబూరావు వీధుల్లో స్థానిక కార్పొరేటర్ కుక్కల అనితతో కలిసి విస్తృతంగా పర్యటించారు. కూలీలు, వర్తక వ్యాపారులు ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్వయంగా ఇంటికి వచ్చి పలకరిస్తుండటంతో ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ , వారి నుంచి సలహాలు, సమస్యలపై వినతులు స్వీకరించారు.

టీడీపీ ఏం చేసిందో చెప్పగలరా

గత ఐదేళ్లలో టీడీపీ ప్రభుత్వం ప్రజలకు ఏమి చేసిందో చెప్పగలరా అని ఆ పార్టీ నేతలను ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రశ్నించారు. తాము ప్రజలకు మేలు చేస్తున్నామని అందుకే గుమ్మం గుమ్మం తిరుగుతూ అన్ని వర్గాల ప్రజల అభిప్రాయాలను ధైర్యంగా తీసుకోగలుగుతున్నామన్నారు. ఒంటరిగా ఎదుర్కొనే సత్తాలేక పొత్తుల కోసం వెంపర్లాడే నేతలు కూడా ముఖ్యమంత్రిపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. యువగళంలో లోకేష్ ఏదిపడితే అది మాట్లాడుతున్నాడని, నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే చాలా మంచిదని హితవు పలికారు. రాష్ట్రంలో రూ. లక్షల కోట్లు స్కాంలకు ఆద్యుడు చంద్రబాబేనన్నారు. కార్యక్రమంలో డీఈఈలు గురునాథం, రామకృష్ణ, ఏఎంహెచ్‌ఓలు రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, నాయకులు కుక్కల రమేష్, కొమ్ము చంటి, ఓబిరెడ్డి వెంకట్రామిరెడ్డి, భాను, లక్ష్మణ్, ప్రసాద్ పాల్గొన్నారు.

నిరంతర సాహితీ యాత్రికుడు డాక్టర్ ఆదినారాయణ



సైబీరియా బాటసారి గ్రంథావిష్కరణ సభలో రచయిత ఆదినారాయణ, సూర్యకుమారి

విజయవాడ కల్చరల్: నిరంతర సాహితీ యాత్రికుడు డాక్టర్ ఆదినారాయణ అని సాహితీ విమర్శకుడు డాక్టర్ కాకుమాను శ్రీనివాసరావు అన్నారు. డాక్టర్ ఆదినారాయణ రచించిన సైబీరియా బాటసారి యాత్ర గ్రంథావిష్కరణ సభ బుధవారం గవర్నర్‌పేటలోని విజయవాడ బుక్ ఫెస్టివల్ కార్యాలయంలో జరిగింది. సభకు అధ్యక్షత వహించిన శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యావేత్తగా భావిభారత పౌరులను తీర్చిదిద్దుతూ సాహిత్యరంగంలోనూ ప్రతిభను చాటుకున్నట్లు తెలిపారు. గ్రంథాన్ని ఆవిష్కరించిన సాహితీవేత్త సూర్యకుమారి మాట్లాడుతూ ఆదినాయణ ప్రకృతి ప్రేమికుడని, గతంలో అనేక యాత్రలు చేసి గ్రంథాలను రచించినట్లు తెలిపారు. సైబీరియా బాటసారి గ్రంథంలో అక్కడి రాజకీయ సామాజిక, సాంస్కృతిక విషయాలను వివరించినట్లు తెలిపారు. సభలో వైద్యులు గుత్తా శివాజీ, న్యాయవాది చిరంజీవి, సాహిత్య సంస్థల ప్రతినిధులు ఎ.కృష్ణ, ఓరా ప్రసాద్, మందరపు హైమావతి.. ఆదినారాయణ సాహితీ విశేషాలను వివరించారు.

32వ డివిజన్‌లో అభివృద్ధి పనులు



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నామని సెంట్రల్ ఎమ్మెల్యే, ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు అన్నారు. 32వ డివిజన్ 228, 229వ వార్డు సచివాలయ పరిధిలోని రూ. 40 లక్షల వ్యయ అంచనాతో బి.టి. సర్ఫేస్ అప్‌గ్రేడేషన్ పనులకు డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కో ఆప్షన్ సభ్యురాలు గుండె సుభాషిణితో కలిసి బుధవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడానికి ప్రతి సచివాలయానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి రూ. 20 లక్షల నిధులు కేటాయించారన్నారు. ఇప్పటివరకు సెంట్రల్‌లోని 66 వార్డు సచివాలయాల పరిధిలో గడప గడపకు కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తిచేసుకోగా.. 61 పనులకు సంబంధించి రూ. 10.58 కోట్ల నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. వీటిలో 14 పనులు పూర్తయినట్లు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వం నియోజకవర్గ ప్రగతిని పూర్తిగా గాలికొదిలేసిందని ఆరోపించారు. ఈ ప్రభుత్వంలో తాము చేపట్టిన పనులపై ధైర్యంగా చెప్పడమే కాకుండా, అభివృద్ధిలో ప్రజలను కూడా భాగస్వాములను చేస్తున్నట్లు మల్లాది విష్ణు తెలిపారు. కార్యక్రమంలో డీఈ గురునాథం, వీఎంసీ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, వార్డు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్కిజోఫ్రెనియాపై అవగాహన కల్పించాలి

డాక్టర్ అయోధ్య ఆర్.కె



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అయోధ్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్కిజోఫ్రెనియా వ్యాధిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని డాక్టర్ అయోధ్య ఆర్.కె. అన్నారు. ప్రపంచ స్కిజోఫ్రెనియా ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా బుధవారం ప్రెస్‌క్లబ్‌లో మానస సైకియాట్రిక్ నర్సింగ్ హోం అధినేత డాక్టర్ అయోధ్య ఆర్.కె. ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ బుధవారం నుంచి మానసిక ఆరోగ్యంపై ప్రధానంగా 'స్కిజోఫ్రెనియా'పై ప్రజల్లో అవగాహన పెంచడానికి వారం పాటు వివిధ రూపాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్) నిర్ణయించిందన్నారు. 24న ప్రపంచ స్కిజోఫ్రెనియా ఆరోగ్య దినంగా గుర్తించారని పేర్కొన్నారు. మానసిక వైద్యులు, సైకాలజిస్టు, సైకియాట్రిస్టులు, ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు విస్తృత ప్రచారం చేసి, వారాంతంలో కార్యక్రమాలను సమీక్షించుకుంటామని తెలిపారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్‌లో భాగంగా వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ మెంటల్ హెల్త్ (డబ్ల్యూఎఫ్ఎంహెచ్) ఆధ్వర్యంలో వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు. ప్రపంచంలో 0.3 నుంచి 0.7 శాతం ప్రజలు జీవిత కాలంలో స్కిజోఫ్రెనియా వ్యాధి పీడితులేనని పేర్కొన్నారు. వ్యాధి వంశపారంపర్యంగా, జీవితంలో ఎదురైన ఒడిదొడుకులు, మెదడులోని కెమికల్ ఇన్‌బ్యాలెన్స్, ఇతరత్రా కారణాలతో వస్తుందన్నారు. దీని ప్రభావం పురుషుల్లో, స్త్రీలల్లో సమానంగా ఉంటుందని తెలిపారు. 'స్కిజోఫ్రెనియా' వ్యాధితో బాధపడేవారికి యాంటి సైకోటిక్స్ అనే మందులు వాడడం ఉత్తమమని చెప్పారు. తొలుత వ్యాధి పట్ల రోగికి, వారి కుటుంబ సభ్యులకు అవగాహన (సైకో ఎడ్యుకేషన్) కల్పించాల్సి వుంటుందన్నారు. డాక్టర్ మానస, డాక్టర్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి పిల్లల పేరిట రూ.5.50 లక్షల డిపాజిట్



డిపాజిట్ పత్రాలను అందుకున్న భరత్ కుటుంబ సభ్యులతో సంఘ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ బిల్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు గుంటూరు జిల్లా పెనుమాక గ్రామ వాసి వేమవరపు భరత్ (జాన్సన్ టైల్స్ ఎంప్లాయి) ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. ఐదేళ్లు, మూడేళ్ల వయసున్న ఆయన ఇద్దరు పిల్లల భవిష్యత్ నిమిత్తం అసోసియేషన్ తరుపున రూ.5.50 లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన పత్రాలను బుధవారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ ముజీబ్ చేతుల మీదుగా నగరంలోని సంఘ కార్యాలయంలో భరత్ కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి పాలడుగు ప్రభాకర్, కోస్తాంధ్ర అధ్యక్షుడు కేఎస్ఎన్ రాజు, సభ్యులు జీఎస్‌వీ కిషోర్, కొల్లూరి అశోక్, బాలకృష్ణ, జస్వంత్, అమర్నాథ్, లక్ష్మీకాంత్ సాయినాథ్ హనుమంతప్ప పాల్గొన్నారు.